క్లుప్తంగా

ఆలయానికి విరాళం



విరాళం ఇస్తున్న కళావతి–గోపాల్‌రెడ్డి

చొప్పదండి: మండల కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర మణికంఠ ఆలయ అభివృద్ధికి జూలపల్లికి చెందిన నోముల కళావతి–గోపాల్ రెడ్డి దంపతులు సోమవారం రూ.60 వేలు విరాళంగా అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బడిగె వెంకటేశ్, వైస్ చైర్మన్ మునిగాల సుధాకర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి చేపూరి సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శి ఉస్కె రాజశేఖర్‌రెడ్డి, సాయి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల అందజేత



బ్యాగులు ఇస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

రామడుగు: మండలంలోని వెలిచాల గ్రామ పరిధి ప్రశాంత్‌భవన్‌లోని విద్యార్థులకు సోమవారం హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ అధ్యక్షుడు జక్కుల రాజు ఆధ్వర్యంలో బ్యాగులు అందజేశారు. కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు రేండ్ల కళింగశేఖర్, ప్రశాంత్‌భవన్ నిర్వాహకుడు సిరిల్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాప్రాంగణాలను వినియోగంలోకి తేవాలి

వీణవంక: గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తేవాలని మాజీ ఉపసర్పంచ్, సామాజిక కార్యకర్త చదువు జితేందర్‌రెడ్డి కోరారు. ఈ సందర్భంగా సోమవారం బొంతుపల్లి గ్రామంలో ఆయన మాట్లాడారు. చాలా గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు వినియోగంలో లేవని, ధాన్యం ఆరబోయడానికి, పశువులను కట్టేయడానికి వాడుతున్నారని, మందుబాబులకు అడ్డాగా మారాయని పేర్కొన్నారు. అధికారులు స్పందించి, వాటిని వినియోగంలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.

దుస్తుల పంపిణీ



దుస్తులు అందించిన వినోద్

గంగాధర: నూతన సంవత్సరం సందర్భంగా గంగాధర మండలంలోని మల్లాపూర్‌లో క్రీస్తు సంఘం ఆధ్వర్యంలో సోమవారం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పాస్టర్ వినోద్, నాయకులు ప్రభాకర్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం



ప్రభాకర్

గంగాధర: మండలంలోని మల్లాపూర్ గ్రామ మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడిగా కోల ప్రభాకర్ ఎన్నికయ్యారు. సోమవారం సంఘం సభ్యులు సమావేశమై, నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా కోల మహిపాల్, ప్రధాన కార్యదర్శిగా పడిదపల్లి మల్లేశం, కార్యదర్శిగా హరీశ్, కోశాధికారిగా అజయ్‌కుమార్ ఎన్నికయ్యారు.

రైతుబంధు డబ్బులు జమ చేయాలి

వీణవంక: యాసంగి సీజన్ ప్రారంభమైనా ఇప్పటివరకు రైతుబంధు డబ్బులు ఖాతాల్లో జమ కాలేదని, పంట పెట్టుబడి కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారని పీఏసీఎస్ డైరెక్టర్ కట్కూరి మదుసుదన్‌రెడ్డి అన్నారు. వీణవంక మండలంలోని ఘన్ముక్కుల గ్రామంలో సోమవారం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతుబంధు రూ.15 వేలు ఇస్తామని చెప్పి, స్పందించడం లేదని ఆరోపించారు. వరి నాట్లు ఊపందుకున్నాయని, పెట్టుబడి కోసం రైతులు ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా వారి బ్యాంకు ఖాతాల్లో డబ్బులు వేయాలని కోరారు. ఆయన వెంట పలువురు బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

జూదరులపై కేసు

చొప్పదండి: పట్టణ శివారులో సోమవారం పేకాడుతున్న నలుగురు వ్యక్తులను పట్టుకున్నట్లు ఎస్సై ఉపేంద్రచారి తెలిపారు. విశ్వసనీయ వర్గాల ద్వారా అందిన సమాచారం మేరకు వెళ్లి, దాడి చేశామన్నారు. వారి వద్ద నుంచి రూ.16,400 స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

మూత'బడులు'.. నాలుగు

- విద్యార్థులు లేరన్న సాకుతో మూసివేసిన అధికారులు
- పిల్లలను ప్రైవేటుకు పంపుతూ తల్లిదండ్రుల ఆర్థిక ఇబ్బందులు
- సర్కారు బడులను తెలిపించాలని వేడుకోలు
- శంకరపట్నం మండలంలోని అనుబంధ గ్రామాల్లో పరిస్థితి



మూతపడిన చర్లపల్లి పాఠశాల

శంకరపట్నం: మండలంలోని అనుబంధ గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలను విద్యార్థులు లేరన్న సాకుతో విద్యాశాఖ అధికారులు మూసివేశారు. శంకరపట్నం, మొలంగూర్, రాజాపూర్, గద్దపాక పంచాయతీల పరిధిలోని చర్లపల్లి, గూడాటిపల్లె, గొల్లపల్లె, ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలు మూతపడ్డాయి. తల్లిదండ్రులకు సర్కారు బడుల్లో చదివించాలని ఉన్నా వాటిని మూసివేయడంతో ప్రైవేటు పాఠశాలలకు పంపుతూ ఫీజులు చెల్లించేందుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. చర్లపల్లిలో ప్రాథమిక పాఠశాలతోపాటు అంగన్‌వాడీ సెంటర్‌ను మూసివేశారు. ఈ గ్రామంలో పిల్లలు బడికి వెళ్లాలన్నా, గర్భిణులు పోషక పదార్థాలు తీసుకోవాలన్నా 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న కేశవపట్నంకు నడిచి వెళ్లాల్సిందే. మూసివేసిన స్కూళ్లను వెంటనే తెరిపించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

గూడాటిపల్లిలో కొన్ని రోజులే..

గూడాటిపల్లిలోని పాఠశాలకు గతంలో ఉపాధ్యాయుడు రాకపోవడంతో విద్యార్థులు ఎదురుచూశారు. గ్రామస్తులు, పిల్లల తల్లిదండ్రులు డీఈవో జనార్దన్‌రావుకు సమాచారం అందించారు. స్పందించిన ఆయన అప్పటి తహసీల్దార్ శ్రీనివాస్‌రావును పంపించి, పాఠశాలను కొనసాగించేలా చర్యలు తీసుకున్నారు. కొన్ని రోజులు స్కూల్‌ను తెరిచిన ఉపాధ్యాయుడు విద్యార్థులు లేరన్న సాకుతో మూసివేశారు.

పాఠశాలలను తెరిపించాలి



మూతపడిన ప్రాథమిక పాఠశాలలను ప్రభుత్వం వెంటనే తెరిపించాలి. స్కూళ్లు లేకపోవడంతో పేద పిల్లలు చదువు కోసం చాలా దూరం వెళ్లాల్సి వస్తోంది. అంగన్‌వాడీ సెంటర్ మూసివేయడంతో గర్భిణులు, బాలింతలు సరుకులు తెచ్చుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు.

– ఏనుగుల అనిల్, ఎంపీటీసీ సభ్యుడు, కేశవపట్నం

టీచర్లను నియమించాలి



గూడాటిపల్లె పాఠశాల ఉపాధ్యాయులు సక్రమంగా రాకపోవడంతో మూతపడింది. ఇక్కడి పేద పిల్లలను తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలలకు పంపిస్తున్నారు. నెలనెలా అధిక ఫీజులు చెల్లించలేక నానాతంటాలు పడుతున్నారు. మూతపడిన స్కూళ్లను తెలిపించి, టీచర్లను నియమించాలి.

– బోద తిరుపతిరెడ్డి, గూడాటిపల్లి

ఘనంగా న్యూ ఇయర్ వేడుకలు



రేకొండలో కేక్ కట్ చేస్తున్న వెంకట్‌రెడ్డి





హుజూరాబాద్ క్లబ్‌లో మాజీ ఎంపీ లక్ష్మీకాంతారావు, రంగాపూర్ కల్వరి టెంపుల్‌లో..

చిగురుమామిడి: నూతన సంవత్సరం 2024లో రాష్ట్ర ప్రజల సమస్యలు పరిష్కారమై, వారి జీవితాల్లో వెలుగులు నిండాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి ఆకాంక్షించారు. సోమవారం చిగురుమామిడి మండలంలోని రేకొండలో సీపీఐ శ్రేణులు న్యూఇయర్ సందర్భంగా ఆయనను కలిసి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వెంకట్‌రెడ్డి వారితో కలిసి కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. పాడిపంటలు సమృద్ధిగా పండాలని, రైతుల కష్టాలు తీరాలని, నిరుద్యోగుల జీవితాలు బాగుపడాలని అన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలు ఆర్థికంగా బలోపేతమై, అభివృద్ధిలోకి పేర్కొన్నారు. రాష్ట్రంలో సీపీఐ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పని చేయాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు అందె స్వామి, మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు బోయిని అశోక్, నాయకులు చాడ శ్రీధర్‌రెడ్డి, అందె చిన్నస్వామి, బూడిద సదాశివ, ముద్రకోల రాజయ్య, దుడ్డెల సమ్మయ్య, రేకొండ సొసైటీ అధ్యక్షుడు మండల కొంరయ్య తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట: పట్టణం, మండలంలోని గ్రామాల్లో నూతన సంవత్సర వేడుకలను ప్రజలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు తుమ్మేటి సమ్మిరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, స్వీట్లు పంచుకున్నారు. ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. కార్యక్రమంలో పొల్సాని సమ్మారావు, బచ్చు భాస్కర్, అడ్వకేట్ తిరుపతి, వీర్రాజు, పున్నం శ్రీనివాస్, ఎండీ.సలీం, ఉపాధ్యాయుడు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్: నియోజకవర్గ వ్యాప్తంగా న్యూ ఇయర్ వేడుకలు సోమవారం అంబరాన్నంటాయి. ప్రజలు తమ ఇళ్ల ముందు ముచ్చటగొలిపే రంగవల్లులు వేసి, కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. అనంతరం దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని హుజూరాబాద్ క్లబ్‌లో నిర్వహించిన వేడుకల్లో రాజ్యసభ మాజీ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతారావు దంపతులు కేక్ కట్ చేశారు.



జమ్మికుంట: కేక్ కట్ చేస్తున్న వాకర్స్

హుజూరాబాద్‌రూరల్: మండల ప్రజలు నూతన సంవత్సర వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి నుంచే కేక్‌లు కట్ చేయడంతో సందడి వాతావరణం నెలకొంది. ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. రంగాపూర్ కల్వరి టెంపుల్‌లో ఫాదర్ నెల్సన్ ప్రత్యేక ప్రార్థనలు చేసి, కేక్ కట్ చేశారు.

ఆధార్ అప్‌డేట్‌కు ఆరాటం

- మీసేవ కేంద్రాల వద్ద బారులుతీరుతున్న ప్రజలు
- సవరణలు ఉంటే తప్ప తప్పనిసరి కాదంటున్న అధికారులు



హుజూరాబాద్‌లో మీసేవ కేంద్రం ఎదుట అర్జీదారులు

హుజూరాబాద్‌రూరల్: ప్రభుత్వం ప్రజా పాలన గ్రామసభల్లో ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకుంటోంది. దీంతో హుజూరాబాద్ నియోజకవర్గంలోని చాలామంది ఆధార్ అప్‌డేట్ కోసం మీసేవ కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. ప్రతీ కేంద్రంలో రోజుకు 40 ఆధార్‌కార్డుల అప్‌డేట్‌కు ఆస్కారం ఉంది. దీంతో ఉదయం నుంచే ఆయా కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. గ్రామసభల్లో అధికారులు అర్జీలను స్వీకరిస్తున్న సమయంలో రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు జిరాక్స్‌లను తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆధార్‌కార్డు వివరాలు సరిగా ఉండాలంటూ ప్రజలు ఆధార్ అప్‌డేట్ కోసం ఆరాటపడుతున్నారు.

నిరంతర ప్రక్రియ..

ఆధార్ అప్‌డేట్ అనేది నిరంతర ప్రక్రియ అనే విషయం తెలియక గడువు ముగుస్తుందంటూ కొందరు మీసేవ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వం అందించే పథకాలకు ప్రస్తుతమున్న ఆధార్, రేషన్ కార్డులే ప్రామాణికం. పదేళ్లు ఆధార్‌లో మార్పులు చేయనివాళ్లు అప్‌డేట్ చేయించుకుంటున్నారు. కానీ, తప్పనిసరి కాదన్న విషయాన్ని గ్రహించాలని అధికారులు సూచిస్తున్నారు. సవరణలు ఉంటే తప్ప ఆధార్‌ను అప్‌డేట్ చేయాల్సిన అవసరం లేదని అంటున్నారు.

అదనంగా వసూలు

అమాయక ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకొని ఆధార్ అప్‌డేట్ కోసం కొందరు మీ సేవ కేంద్రాల నిర్వాహకులు రూ.100 వసూలు చేస్తున్నారు. రూ.50 మాత్రమే తీసుకోవాలని ఆదేశాలున్నా బేఖాతరు చేస్తుండటం గమనార్హం.

ఎక్కువ తీసుకుంటున్నారు



ఆధార్ కార్డులో ఇంటి పేరు, పుట్టిన తేదీ మార్పు చేసుకుందామని మీసేవ కేంద్రానికి వెళ్తే ప్రభుత్వం విధించిన చార్జీల కంటే ఎక్కువ తీసుకుంటున్నారు. ఇదేంటని అడిగితే సరైన సమాధానం ఇవ్వడం లేదు. అధికారులు దీనిపై దృష్టిసారించాలి.

– సంధ్య, ప్రైవేట్ స్కూల్ టీచర్, హుజూరాబాద్

సేంద్రియ, ప్రకృతి వ్యవసాయం మేలు

- జీఎన్ఎన్ఎస్ అధ్యక్షుడు డాక్టర్ వంగల గోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న డాక్టర్ గోపాల్‌రెడ్డి

జమ్మికుంట: ప్రస్తుత పరిస్థితులకు సేంద్రియ, ప్రకృతి వ్యవసాయం మేలని, ఈ పద్ధతులను రైతులు పాటించాలని కాకతీయ విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి, జీఎస్ఎస్ఎస్(గ్రామ నవ నిర్మాణం సమితి) అధ్యక్షుడు డాక్టర్ వంగల గోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం జమ్మికుంట పట్టణంలోని కేవీకేలో కేంద్రం వ్యవస్థాపకుడు పరిపాటి జనార్దన్‌రెడ్డి జయంతి సందర్భంగా సేంద్రియ, ప్రకృతి వ్యవసాయంపై రైతులకు, రైతు ఉత్పత్తిదారుల సభ్యులు, వ్యవసాయ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాల్‌రెడ్డి, కాకతీయ విశ్వవిద్యాలయం ఆచార్యుడు డాక్టర్ రామ్‌రెడ్డి, జీఎస్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి విజయ గోపాల్‌రెడ్డిలు మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు పంటలను కాపాడుకోవడానికి, దిగుబడులు తీయాలన్న ఉద్దేశంతో మోతాదుకు మించి క్రిమిసంహారక, కలుపు నివారణ రసాయనాలు, అధిక ఎరువులు వేస్తున్నారని తెలిపారు. దీనివల్ల నేలసారం తగ్గుతుందని, ఇలా వచ్చి పంట ఉత్పత్తులను ఆహారంగా తీసుకునే మానవుని ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. సుస్థిర పద్ధతులైన సేంద్రియ, ప్రకృతి వ్యవసాయంతో నేల, మానవుని ఆరోగ్యం కాపాడవచ్చని అన్నారు. అనంతరం కేవీకే సిబ్బంది, రైతు ఉత్పత్తిదారుల సంఘం సభ్యులు, ఆదర్శ రైతులను సత్కరించారు. కార్యక్రమంలో దుర్గాప్రసాద్, సత్యనారయణరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త వెంకటేశ్వర్‌రావు, శాస్త్రవేత్తలు శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్, మహేశ్, విజయ్, ప్రశాంతి, రైతు ఉత్పత్తిదారుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే సత్యం

గంగాధర: ప్రజలకు అందుబాటులో ఉండి, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. సోమవారం నూతన సంవత్సరం సందర్భంగా గంగాధర మండలం కురిక్యాలలోని ఓ ఫంక్షన్‌హాలులో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చొప్పదండి నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తనను కలవడానికి వచ్చినవారు పుష్ప గుచ్ఛాలు, శాలువాలు కాకుండా పేద విద్యార్థుల కోసం పెన్నులు, పెన్సిళ్లు, నోటుబుక్కులు తీసుకువచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఉన్నత చదువులు చదవేందుకు పేద పిల్లలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

రాములోరి అక్షింతల పంపిణీ



మానకొండూర్: అక్షింతలు ఇస్తున్న శ్రవణ్



జమ్మికుంట: అక్షింతలు పంపిణీ చేస్తున్న భక్తులు



కొత్తగట్టులో శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు



హుజూరాబాద్‌లో బీజేపీ నాయకులు..

జమ్మికుంట: పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో అయోధ్య రామాలయం నుంచి వచ్చిన రాములోరి అక్షింతలకు స్థానిక సాయిబాబా ప్రాంగణంలోని శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత రాములోరి విగ్రహం, అక్షింతలను పల్లకిలో ఉంచి, శోభాయాత్ర జరిపారు. ఇంటింటికీ వెళ్లి, అక్షింతలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూర విజేందర్‌రెడ్డి, ఎర్రబెల్లి సంపత్‌రావు, వేముల జగన్, తూడి రవిచంద్రారెడ్డి, అనూమాస రాజేందర్, నసీరొద్దీన్, శంకర్, ఉప్పల సాంబశివరెడ్డి, కొమురారెడ్డి, సదాశివుడు, రవీందర్,కొంరయ్య తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్: శ్రీరాములోరి అక్షింతలు సోమవారం హుజూరాబాద్ పట్టణంలోని రామాలయానికి చేరుకున్నాయి. వాటిని ఆయా వార్డుల్లో బీజేపీ నాయకులు స్థానికులకు పంపిణీ చేశారు. ఈ నెల 22న శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం జరగనున్న నేపథ్యంలో 15వ తేదీ వరకు అక్షింతలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సహకార్యవాహక్ రాజశేఖర్, జిల్లా సహసేవ ప్రముఖ్ గుంటి శ్రీనివాస్, బీజేపీ నాయకులు తూర్పాటి రాజు, మంచికట్ల సదానందం, మాడ సందీప్, బూర్ల సతీశ్, గుండెటి భార్గవ్, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

మానకొండూర్: శ్రీఅయోధ్య ట్రస్టు నుంచి వచ్చిన రాములోరి అక్షింతలను సోమవారం మండల కేంద్రంలోని ప్రజలకు పంపిణీ చేశారు. వీటిలో ఇంట్లో జరిగే శుభకార్యాలకు వాడుకోవాలని సూచించారు. ట్రస్టు సభ్యులు శ్రవణ్, ప్రదీప్ తదితరులున్నారు.

శంకరపట్నం: రాములోరి అక్షింతలకు శ్రీఅయోధ్య రామమందిర్ ట్రస్ట్ సభ్యులు సోమవారం కొత్తగట్టు గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. స్థానిక ఆంజనేయస్వామి దేవాలయం వరకు తీసుకెళ్లారు. కార్యక్రమంలో సర్పంచ్ మోరాల కిషన్, రాంభద్రారావు, శ్రీనివాస్‌గౌడ్, ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'అన్నదానం గొప్పది'

విద్యానగర్(కరీంనగర్): దానాలన్నింటిలోకి అన్నదానం గొప్పదని, ఆకలితో బాధపడే వారికి కాస్తంత అన్నం పెడితే అన్నదాత సుఖీభవ అని దీవిస్తారని, దాతలకు అమ్మవారి కృపకటాక్షలు లభిస్తాయని శ్రీదుర్గాభవానీ ఆలయ ధర్మాధికారి, వేదపండితులు పురాణం మహేశ్వరశర్మ అన్నారు. నగునూర్‌లోని శ్రీదుర్గాభవానీ ఆలయంలో సోమవారం శ్రీశృంగేరి శారద నిత్యాన్నదానం ప్రారంభించారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు అమ్మవారి ప్రసాదంగా అన్నప్రసాదాన్ని అందించడం ద్వారా దాతలకు అమ్మవారి కరుణ కటాక్షాలుంటాయన్నారు. ఆలయ ప్రధానార్చకులు పవనకృష్ణశర్మ, ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగళ లక్ష్మణ్, అన్నదాన కార్యక్రమ నిర్వహణ బాధ్యులు రాచమల్ల ప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రమాద బీమాపై హర్షం

కరీంనగర్ కార్పొరేషన్: ఆటో డ్రైవర్లు, హోంగార్డులు, కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.5లక్షల ప్రమాద బీమా కల్పించడం పట్ల కాంగ్రెస్ పార్టీ హర్షం వ్యక్తం చేసింది. సోమవారం నగరంలోని బస్‌స్టేషన్ ప్రాంతంలో ఆటో కార్మికులకు స్వీట్లు పంపిణీ చేసింది. ప్రమాద బీమా కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఈ సందర్భంగా నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, మల్యాల సుజిత్‌కుమార్, పులి ఆంజనేయులు, కంకణాల అనిల్, మెతుకు కాంతయ్య, శ్యామ్‌సుందర్, ధన్సాసింగ్, పొన్నం మధు, పోరండ్ల రమేశ్, విద్యాసాగర్, జ్యోతిరెడ్డి, ప్రసాద్, జీవన్, గంగుల దిలీప్, జేరిపోతుల వాసు, భరత్, అనిల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఖాసీంపేట మానసాదేవి ఆలయంలో భక్తులు

ఆలయాల్లో భక్తుల సందడి

గన్నేరువరం: కొత్త సంవత్సరం సందర్భంగా గన్నేరువరం మండలంలోని పలు ఆలయాల్లో సోమవారం భక్తుల సందడి నెలకొంది. ఖాసీంపేట శ్రీ మానసాదేవి ఆలయానికి కరీంనగర్, సిద్దిపేట, రాజన్నాసిరిసిల్ల జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి, అమ్మవారిని దర్శించుకున్నారు. శివలింగాలకు నీరు పోశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. పారువెల్ల శ్రీ లక్ష్మీగణపతి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ గౌరవ అధ్యక్షుడు బద్దం నరసింహారెడ్డి, చైర్మన్ ఏలేటి చంద్రారెడ్డి, డైరెక్టర్లు, సర్పంచ్ గంప మల్లీశ్వరి, ఉప సర్పంచ్ బద్దం సంపత్‌రెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.